# లోక్‌సత్తా పార్టీ

## "మహిళా సాధికారికత కోసం మంచిరాజకీయం" పై అర్థవంతమైన చర్చలు

### లోక్‌సత్తాపార్టీ మార్చి8 ఉత్సవాలకు రాష్ట్రంలో ఉత్సాహపూరిత స్పందన

లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించాక జరుపుకున్న తొలి అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో పార్టీ కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాలకు మహిళల నుంచి మంచి స్పందన లభించింది. "మహిళా సాధికారికత కోసం మంచి రాజకీయం'' అనే అంశం మీద లోక్‌సత్తా నిర్వహించిన చర్చలు అర్థవంతంగా ఆసక్తికరంగా సాగాయి. చట్టంతో ప్రమేయం లేకుండా మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను స్వచ్ఛందంగా ప్రకటించిన లోక్‌సత్తా పార్టీ సారధ్యంలో మున్ముందు స్త్రీలు అన్ని రంగాల్లో విజయాలు సాధించగలరని అందరూ ముక్త కంఠంతో ఆశాభావం వ్యక్తం చేశారు. 'లోక్‌సత్తా వచ్చింది... మంచి రోజుల్ని తెస్తుంది'. అనే విశ్వాసం అందరి గొంతుల్లో విన్పించింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాన వక్తగా ఓల్గా మాట్లాడుతూ, "ప్రపంచీకరణ వచ్చాక నగరంలో మహిళా దినోత్సవానికి అర్థమే మారిపోయింది. లక్స్, ఫెయిర్ అండ్ లవ్లీ వంటి ఉత్పత్తుల తయారీ సంస్థలు మహిళల్ని అలంకారప్రాయంగా మార్చటానికి ఈ రోజును వినియోగించుకుంటున్నాయి. మహిళా దినోత్సవం మహిళలను కించపరిచేదిగా మారిపోయింది. అందుకే ప్రతి మార్చి 8వ తేదీన మేం గ్రామాలకు వెళ్లి మహిళాదినోత్సవం జరుపుతున్నాం. ఈసారి లోక్‌సత్తా పార్టీ నిర్వహించే మహిళాదినోత్సవం కాబట్టే ఇక్కడకు వచ్చాను. ఈ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళల నిజమైన అభివృద్ధికి కృషి చేసే పార్టీ. మహిళా సాధికారికతకు లోక్‌సత్తా కృషి ఎంతైనా అభినందనీయం'' అన్నారు... దాదాపు ఇదే అభిప్రాయాన్ని రాష్ట్రం నలుమూలల నుంచి అందరూ విన్పించారు. మహిళల అభివృద్ధికి మంచి రాజకీయాల్ని నడిపించే లోక్‌సత్తాపార్టీ అధికారంలోకి రావాలని వారంతా ఆకాంక్షించారు. డా॥ జయప్రకాష్ నారాయణ నాయకత్వం పట్ల విశ్వాసం వ్యక్తంచేశారు.

హైదరాబాద్, గుంటూరు, విశాఖ జిల్లా తదితర ప్రాంతాలలో 8 మార్చి,2007న లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన మహిళా దినోత్సవ విశేషాలు క్లుప్తంగా...

### హైదరాబాద్‌లో...

నగరంలోని పబ్లిక్ గార్డెన్స్ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ వి.ఎస్.రమాదేవి, భూమిక పత్రిక సంపాదకురాలు కొండవీటి సత్యవతి, స్టేట్‌బ్యాంక్ ఉన్నతాధికారి రోహిణీరావు, రచయిత్రి ఓల్గా, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మనోరమ ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. తురగా జానకీరాణి సమన్వయకర్తగా వ్యవహరించారు.

మహిళలు ఇంకా ఉత్సవాలు జరుపుకునే దశకు చేరుకోలేదని, కాబట్టి ఈరోజును మహిళాదినోత్సవం అనటం సబబుకాదని భూమిక ఎడిటర్ సత్యవతి అన్నారు. దేశంలో మహిళల అక్రమ రవాణా రోజురోజుకూ పెరిగిపోతోందని, వీరిలో ఎక్కువ ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచీకరణ వల్ల చేతివృత్తులు నశించి కుటుంబాలు వీధుల పాలవుతుండటం వల్ల స్త్రీలే ఎక్కువ నలిగిపోతున్నారు. కాబట్టి ఆర్థికవ్యవస్థను మహిళల కోణం నుంచి చూడాలని సత్యవతి కోరారు.

అయితే వాస్తవ సమస్యల పట్ల నిరాశపడుతూ కూర్చోవటం తగదని వి.ఎస్.రమాదేవి సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే మహిళలు ఎలాంటి విజయాలనైనా సొంతం చేసుకోగలరని, తన పాతికేళ్ల పారిశ్రామికరంగ అనుభవంతో

ఈ నిజాన్ని చెబుతున్నానని ఆమె అన్నారు. భారత్‌లో చట్టసభల్లో మహిళల సంఖ్య పెరుగుతున్నా వ్యవస్థలో చెప్పుకోదగిన మార్పులు రాలేదని రోహిణీరావు అన్నారు. మహిళలు మరింత పోరాటపటిమతో ముందుకు సాగాల్సుందని అభిప్రాయపడ్డారు. మహిళలకున్న అవకాశాల కన్నా అణచివేత చాలా ఎక్కువస్థాయిలో ఉందని ఓల్గా అన్నారు. దేశంలో మహిళల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుండటం ఎలాంటి అభివృద్ధిని సూచిస్తుంది అని ప్రశ్నించారు. మహిళల శ్రమకు గుర్తింపు లభించి వారికి గౌరవం లభించినరోజునే నిజమైన మహిళాదినోత్సవం అన్నారు.

**ఇది మహిళ, యువత పార్టీ**

లోక్‌సత్తా మహిళల, యువత పార్టీ అని రాష్ట్ర కమిటీ సభ్యురాలు మనోరమ అన్నారు. అవసరమైతే 33శాతానికి మించి కూడా మహిళలకు స్థానం కల్పిస్తామన్నారు. ఇంటిని చక్కదిద్దే చేతులు, దేశాన్ని దిద్దలేవా?... కాబట్టి మహిళలు ముందుకొచ్చి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఆమె కోరారు. లోక్‌సత్తా ఇందుకు సరైన వేదిక అన్నారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు భండారి అంకయ్య, క్రమశిక్షణాసంఘం రాష్ట్ర కన్వీనర్ నాగమణి, మహిళా నేతలు లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. కేవలం ఒక్కరోజే కాకుండా, మార్చి 8 నుంచి ఐదురోజుల పాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో మహిళాదినోత్సవం కార్యక్రమాలు జరిగాయి.

**గుంటూరులో...**

అరండల్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలు జరిగాయి. లోక్‌సత్తా పార్టీ ప్రతిపాదిస్తున్న మంచి రాజకీయాల వల్ల మహిళల సాధికారత స్వప్నం సాకారమవుతుందని జిల్లా కోఆర్డినేటర్ జె.ఐ రామమూర్తి అన్నారు. లోక్‌సత్తా అందిస్తున్న అవకాశాన్ని మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పార్టీ నాయకురాలు పద్మారాణి తన అధ్యక్షోపన్యాసంలో కోరారు. అంబేద్కర్ అడుగుజాడలో వచ్చిన లోక్‌సత్తా పార్టీ మహిళలకు ఆశాకిరణంలా కన్పిస్తోందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ దళిత్ ఉమెన్ నాయకురాలు బి.ఎం.లీలాకుమారి అన్నారు. మహిళలు రచ్చగెలవాలంటే ముందు ఇంటగెలవాలని, కాబట్టి పురుషులు కూడా వారికి తోడ్పాటునందించాలని ఇతర వక్తలు డా॥ ఆర్. సరళాదేవి, వైదేహి (లెక్చరర్), బాలాకుమారి (అడ్వకేట్) సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సుంకర శ్రీనివాసరావు, కోశాధికారి కనకారావు, జె.పి వెంకటేశ్వర్లు, సాంబయ్య, నగర కోఆర్డినేటర్ జె.బి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**విశాఖ జిల్లాలో...**

జిల్లాలోని విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నంలో లోక్‌సత్తా పార్టీ మహిళాదినోత్సవ చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. విశాఖ నగరంలోని పార్టీ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో వివక్షతలు, అసమానతలు లేని మంచి రాజకీయంపై జరిగిన చర్చలో జిల్లా పార్టీ సమన్వయకర్త బి.కృష్ణంరాజు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన మహిళలు, గృహిణులు లోక్‌సత్తాకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అనకాపల్లి విజయ రెసిడెన్సీలో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.వి.ఎస్ రాయ్, జిల్లా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.ఎన్ పట్నాయక్, పి. రామచంద్రరావు, సోమలింగేశ్వరరావు, పడాల మాధురి, ఎస్. రామం, సూర్యారావు, కాత్యాయని, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మహిళల హక్కులు, ప్రత్యేక చట్టాలు గురించి ఉత్సాహపూరిత చర్చ జరిగింది. నర్సీపట్నం మండలంలో కోఆర్డినేటర్ తవ్వా చిరంజీవి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

**ఒంగోలులో...**

"ప్రపంచవ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తినిచ్చిన ఈ రోజున మనమందరం సంఘటితమై మహిళల సమస్యల గురించి మాట్లాడుకుందాం- పరిష్కారదిశగా పయనిద్దాం'' అని ప్రకాశం జిల్లా లోక్‌సత్తాపార్టీ ఇచ్చిన మార్చి8 పిలుపునకు మంచి స్పందన లభించింది. ఒంగోలు ఎన్.జి.వో హోమ్‌లో జిల్లా సమన్వయకర్త లయన్ డా॥ నారాయణం రాధాదేవి వివిధరంగాల మహిళలతో చర్చావేదిక నిర్వహించారు.